
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

శనివారం 15 నవంబరు 2025

డిజిటల్ అరెస్టు ముఠా ఆటకట్టు



నిందితుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

- 12 మంది అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- రూ.12లక్షల నగదు, 17 సెల్‌ఫోన్లు, పాస్‌బుక్కులు, ఏటీయం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు అంటూ బెదిరించి డబ్బులు లాగేస్తున్న 12 మంది అంతర్రాష్ట్ర సైబర్ ముఠా సభ్యులను పులివెందుల పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, వేంపల్లె సీఐ నరసింహులు, సైబర్ క్రైం సీఐ మధుసూదనరెడ్డితో కలిసి ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

వేంపల్లెకు చెందిన రిటైర్డ్ ఎంఈవో వీరారెడ్డిని డిజిటల్ అరెస్టు పేరుతో వీడియోకాల్స్ చేసి ఢిల్లీలో కేసు నమోదుతో పాటు ఫేక్ సుప్రీం కోర్టు కాపీలు వాట్సప్ ద్వారా పంపించి బెదిరించారన్నారు. ఈ అరెస్టు తాత్కాలికంగా వాయిదా వేసేందుకు తమకు అమౌంటు చెల్లించాలని చెప్పడంతో వారి మాటలకు భయపడిన వీరారెడ్డి తన అకౌంటులోని డబ్బు పంపించాడన్నారు. అలా దాదాపు ఏడు నెలల నుంచి వీరారెడ్డిని బెదిరిస్తూ లక్షల్లో డబ్బులు వసూలు చేశారన్నారు. చివరికి వీరారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు డీఎస్పీ సైబర్ సెల్ సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి ఈ కేసును ఛేదించామని అన్నారు. వీరు వీరారెడ్డి వద్ద డబ్బులు వసూలు చేసేందుకు వేంపల్లెకు వచ్చినట్లు సమాచారం రావడంతో 12 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పులివెందుల డీఎస్పీ ఆధ్వర్యంలో అరెస్టు చేశామన్నారు.. అరెస్టు అయిన వారి వద్ద నుంచి రూ.12.58లక్షల నగదు, 17 సెల్‌ఫోన్లు, 13 బ్యాంకు పాస్ బుక్కులు, 52 ఏటీఎం కార్డులు, ఆరు చెక్‌బుక్‌లు, 16 సిమ్‌కార్డులు, 6 ఆధార్‌కార్డులు సీజ్ చేసినట్లు తెలిపారు.

డిజిటల్ అరెస్టు అంటే భయపడవద్దు..

ఎవరైనా కొత్త వ్యక్తులు వాట్సాప్ కాల్ కానీ, ఇన్‌స్టాగ్రామ్ వీడియోకాల్స్ చేసి మీ ఆధార్‌కార్డు ద్వారా సిమ్‌కార్డు తీసుకుని నేరాలకు పాల్పడ్డారంటూ మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామంటే ఎవరూ భయపడవద్దని ఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు కానీ ఎన్ఐఏ, సీబీఐ అధికారులు ఎవరూ వీడియోకాల్ చేయరని, ఏదైనా నేరాల్లో ఉంటే నేరుగా పోలీసులే ఇంటి వద్దకు వస్తారని అన్నారు. ఇలాంటి వీడి యోకాల్స్‌కు ఎవరు కూడా భయపడవద్దని, వారి మాటలకు స్పందించవద్దని సూచించారు. ఇలాంటి కాల్స్ వస్తే తక్షణమే సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నిందితుల వివరాలు, నేపథ్యం

- కర్ణాటక రాష్ట్రం శివమొగ్గలోని ఓసా నగర్‌కు చెందిన నరసింహ ఆలియాస్ నవీన్ బీబీయం వరకు చదువుకున్నాడు. టెలిగ్రాం గ్రూపు ద్వారా అకౌంటు వివరాలు సేకరించి ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు చెందిన యువకులకు డబ్బులు ఆశ చూపించి వారి వద్ద నుంచి కొత్త బ్యాంకు అకౌంటులు చేయిస్తాడు. దీని ద్వారా డిజిటల్ అరెస్టు పేరుతో ఢిల్లీ, ముంబై ప్రాంతాల నుంచి రిటైర్డ్ ఉద్యోగులను బెదిరించి ఆ అకౌంట్లకు డబ్బులు వేయించుకుంటాడు. సదరు అమౌంటు ప్రాపే కంపెనీ, క్రిప్టో కరెన్సీ లేదంటే క్యాష్ రూపంలో వసూళ్లు చేసుకుంటారు.
- రాజస్థాన్ రాష్ట్రం బాల్సువాడలోని పలోడా బ్లాక్‌గాబికి చెందిన పీయూష్ కేలీ హోటల్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. ఇతను డిగ్రీ వరకు చదువుకుని గతంలో దుబాయ్‌లో పనిచేస్తూ తిరిగి సొంత ఊరు వచ్చి గ్రోపే కంపెనీ తరపున ఉంటూ సైబర్ క్రైం అకౌంట్లు ఉన్న వారికి లాడ్జిలు తీసుకుంటూ వారి అకౌంట్ల ద్వారా డబ్బులు డ్రా చేసుకుంటాడు. సైబర్ నేరగాళ్లతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నాడు.
- ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం గుడిపూరిపాలెంకు చెందిన రవిచంద్ర ఆలియాస్ రవీంద్ర బీటెక్ సెకండియర్‌లో డ్రాప్ అయ్యాడు. ప్రకాశం జిల్లా వాగుల ఉప్పలపాడులోని మాధవరం గ్రామానికి చెందిన ప్రశాంత్ డిగ్రీ చదువుకుంటున్నాడు. వీరు టెలిగ్రాం ద్వారా ముంబైలో ఉన్న నవీన్‌కు పరిచయం అయ్యారు. వీరిద్దరూ బంధువులు, స్నేహితులకు ఎక్కువ డబ్బులు ఇస్తారంటూ ఆశ చూపించి బ్యాంకు అకౌంట్లతో పాటు ఏటీయం కార్డులు చేయించి వాటిని ముంబైలో ఇస్తుంటారు. అలాగే ప్రకాశం జిల్లా నాగుల ఉప్పలపాడుకు చెందిన అన్నపురెడ్డి పోతురాజు, పొదిలి మండలం రెడ్డిపాలెంకు చెందిన చెన్నపురెడ్డి పెద్దబ్రహ్మరెడ్డి, గుంటూరు టౌన్ కోటరిపాడుకు చెందిన కుడుమల వెంకటరెడ్డి, విజయవాడలోని భవాని పురానికి చెందిన చిన్నపురెడ్డి బ్రహ్మరెడ్డి, కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన ఉప్పరి నాగేంద్ర సైతం నిందితులు. కడప జిల్లా రంగసముద్రంలోని గిరినగర్‌కు చెందిన తిరువీధి విష్ణువర్ధన్, కొండాపురం మండలం ఎస్.తిమ్మాపురానికి చెందిన ఒంటెద్దు సాయి లిఖిత్‌కుమార్‌రెడ్డి పులివెందులలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఫోర్త్ ఇయర్ చదువుకుంటున్నారు. డబ్బులకు ఆశ పడి వీరు సైబర్ నేరస్తులతో చేతులు కలిపి తమకు తెలిసిన వారితో అకౌంట్లు చేయిస్తూ వాటిని కొరియర్ ద్వారా నవీన్‌కు చేరవేస్తుంటారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని కుమ్మరిగూడెంకు చెందిన పాలబిందెల అఖిల్ ఇంజనీరింగ్ చదువుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. వీరంతా తమకు తెలిసిన వారి అకౌంట్లు పంపించి వాటికి వచ్చే డబ్బుల నుంచి కమీషన్ తీసుకునేవారు.

అయోమయం పరీక్షలు

- 1, 2 తరగతుల విద్యార్థులకు 80 మార్కుల ప్రశ్నపత్రం
- సమ్మెటివ్ పరీక్షలపై మండిపడుతున్న ఉపాధ్యాయులు



సమ్మెటివ్ పరీక్షలపై ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న కార్టూన్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే పిల్లలు భయపడకూడదు. చదువుపట్ల ప్రేమ పెరగాలి. అదే విద్యా సంస్కరణల నిజమైన లక్ష్యం కావాలి. అయితే ప్రస్తుతం జరుగుతున్న సమ్మెటివ్ పరీక్షల్లో చిన్నారులు అయోమయం గందరగోళ పరిస్థితుల్లోకి వెళ్లారు.

జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మెటివ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు 80మార్కుల ప్రశ్నపత్రం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది. ప్రాథమిక విద్యార్థుల మనసులనూ, మానసిక శక్తిని పరిగణనలోకి తీసుకోకుండా పరీక్షల విధానాన్ని రూపొందిస్తోన్న విద్యాశాఖ అధికారుల తీరుపై ఉపాధ్యాయ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. 1, 2 తరగతుల చిన్నారులకు 80 మార్కుల సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించడం సరైందా? అనే ప్రశ్న ఇప్పుడు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఉపాధ్యాయులకే చెమటలు..!

పరీక్ష సమయం 2.30 గంటలు నిర్ణయించగా, ప్రశ్నల పొడవు, కఠినత చూసి ఉపాధ్యాయులకే చెమటలు పట్టే పరిస్థితి. ఇది పిల్లల పరీక్షా పత్రమా, లేక పీజీ విద్యార్థుల పరీక్ష పత్రమా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల మానసిక స్థితిని అసలు పరిగణనలోకి తీసుకోలేదు. ఫార్మేటివ్ ప్రశ్నపత్రాలు సిలబస్‌కు తగనివి. వీటిలో శాస్త్రీయత ఏమాత్రం లేదు. చిన్నారులు విద్యపై కాకుండా, పరీక్షల భారంతో చదువుపట్ల విరక్తి చెందే పరిస్థితి వస్తుంది. ఇలాంటి ప్రశ్నపత్రాలు రూపొందించే వారిని మానసిక వైద్యులకు చూపించాల్సిందే. పిల్లల స్థాయి, వయస్సు ఏంటో తెలుసుకోకుండా పేపర్లు సిద్ధం చేస్తున్నారు అంటూ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం సమ్మెటివ్ మూల్యాంకనం అంటే విద్యార్థి నేర్చుకున్న విషయాన్ని అంచనా వేయడం. కానీ ఇక్కడ అది శిక్షగా మారింది. ఈ విధమైన అశాస్త్రీయ మూల్యాంకన విధానాలు పిల్లల్లో భయం, నిరుత్సాహం కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రశ్నపత్రం మార్చాలి

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, పరీక్షల విభాగం డైరెక్టర్ తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించి, ప్రశ్నపత్రాల రూపకల్పనలో మార్పులు తేవాలి. లేకపోతే పిల్లల మానసిక ఆరోగ్యంపైనే దుష్ప్రభావం పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమన్వయంతో పనిచేయండి

- వైద్యులు, సిబ్బందికి సూచించిన కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి నాగరాజు, డీసీహెచ్ ఎస్ హిమ దేవిలతో కలసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. గర్భిణుల ఆరోగ్య స్థితిపై సచివాలయ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెండవ ప్రాధాన్యతగా బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడా పోషకాహార లోపం పిల్లలు, రక్త హీనతతో మహిళలు ఉండకూడదన్నారు. వైద్యాధికారులు ప్రతి రోజు విధులకు హాజరు కావాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. మాతా శిశు మరణాలు తగ్గాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ రవికుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖల ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల వివరాలను పక్కాగా సేకరించి వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. జిల్లాలో పాజిటివ్ రేటు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్ లక్ష్మణ్‌కుమార్

పులివెందుల రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత్ర పజలను, రైతులను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళ్తున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పులివెందుల, చక్రాయపేట, వేంపల్లె, వేముల, లింగాల మండలాల్లోని గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన జాతి ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా పేరుమీదుగా కేంద్ర ప్రభుత్వం జాతీయ గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధి పథకాన్ని రూపొందించిందన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంతంలోని గ్రామాలలో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, వ్యవసాయం సమగ్రంగా అభివృద్ధి చేస్తారన్నారు. పులివెందుల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగంలో గిరిజనులు మరింత బలోపేతం కాబోతున్నారన్నారు. గిరిజన ప్రాంత రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా వివిధ రకాల పనిముట్లు ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. అనంతరం జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కృష్ణ ప్రియ గిరిజన గ్రామ రైతులు పండించే వివిధ రకాల పంటలు, వాటి యాజమాన్య పద్ధతులు అధిక దిగుబడి సాధించడానికి కావాల్సిన మెళకువలను, సస్యరక్షణ విధానాలను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు శివశంకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, రమేశ్, ఓబులేసు, చంద్రశేఖర్ రెడ్డి, టెక్నికల్ వ్యవసాయాధికారి సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ప్రభాకర్‌రెడ్డి

స్కానింగ్‌లకు ఆంక్షల సంకెళ్లు!

- అందని ద్రాక్షలా రోగ నిర్ధారణ 7

భర్త ఇంటి వద్ద ఆందోళన



అత్తింటి వద్ద తల్లిదండ్రులతో కలిసి నిరసన చేపట్టిన రెడ్డి వెంకటదామిని

ప్రొద్దుటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పెళ్లయిన రోజే.. అత్తారింటికి వచ్చిన భార్యతో "నాకు ఇష్టంలేని పెళ్లి చేశారు. నీవు నాకు వద్దు" అని చెప్పి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి భార్యను వదిలించుకునే ప్రయత్నం చేశాడో ప్రబుద్ధుడు. లాయర్లు పెద్ద మనుషుల వద్ద పంచాయితీ జరిగాక.. ఆ అమ్మాయితో కాపురం చేసేందుకు ఒప్పుకున్నాడు. చివరికి ఇంటికి వస్తే ఇంట్లోకి రానివ్వ కుండా బయట పెట్టడంతో ఆ నవ వధువు అత్తారింటి వద్ద ఆందో ళన చేపట్టింది. బాధితుల కథనం మేరకు..

బద్వేలుకు చెందిన రెడ్డి వెంకటరమణయ్య తన కుమార్తె రెడ్డి వెంకటదామిని(23)ని ప్రొద్దుటూరు శ్రీరాంనగర్‌కు చెందిన పోసా గిరి కుమారుడు పోసా మధుసూదన్‌కు రూ.5లక్షల కట్నంతో పాటు బంగారు నగలు ఇచ్చి జూన్ 8 వతేదీన ప్రొద్దుటూరు దేవాంగ కల్యాణ మండపంలో వివాహం జరిపించారు. పెళ్లయి కల్యాణ మండపం నుంచి శ్రీరాంనగర్‌లోని భర్త ఇంటికి వెళ్లగానే భర్త మధు "నీవంటే నాకు ఇష్టం లేదు. మా తల్లిదండ్రులు బలవంతాన పెళ్లి చేశారు" అని చెప్పి ఇంట్లో ఉండే పురుగుల మందు తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యాడు. దీంతో షాక్‌కు గురైన దామిని తల్లిదండ్రులు బంధువులు, పెద్దమనుషులు, లాయర్ల వద్ద పంచాయితీ పెట్టించారు. బద్వేలు, ప్రొద్దుటూరులోని పలు పోలీసు స్టేషన్లలో కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్లలో పెద్దమనుషుల పంచాయితీలో కాపురం చేస్తానని మధుసూదన్ ఒప్పుకున్నాడు. ఈ మేరకు శుక్రవారం కాపురానికి వచ్చిన దామినిని ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో తల్లిదండ్రులతో సహా శ్రీరాంనగర్‌లో ఆందోళన చేపట్టారు. ఇంట్లో ఉన్న భర్త, అత్తమామలు దామిని తల్లిదండ్రులు, బంధువులతో వాదులాడి ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లిపోయారు. దీంతో బాధితులంతా మధసూదన్ ఇంటి ముందే నిరసన చేపట్టారు. సాయంత్రం వరకు భర్త తరపున వాళ్లు ఎవ్వరూ అక్కడి రాలేదు. దీంతో వారు నిరసన కొనసాగిస్తున్నారు.

కడప మార్కెట్ యార్డుకు నూతన పాలకవర్గం

- చైర్మన్‌గా మహమ్మద్ ఉస్మాన్

కడప రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ప్రభుత్వం విడతల వారీగా నామినేటెడ్ పదవులను భర్తీచేస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన కడప మార్కెట్ యార్డుకు నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఏడాదిపాటు నూతన పాలకవర్గం కొనసాగనుంది. హోదా రీత్యా కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిని గౌరవ అధ్యక్షురాలిగా నియమించారు. అధ్యక్షుడుగా మహ్మద్ ఉస్మాన్, ఉపాధ్యక్షుడుగా రాజు వెంకటసుబ్బారెడ్డి, సభ్యులుగా పి.శిరీష, దేశు స్వర్ణలత, రామిరెడ్డి ఓబుల్ రెడ్డి, చలపతి వెంకటసుబ్బయ్య, వి.హరిత, షేక్ అఖిలా బేగం, జీనిగారి నరసింహం, బండెల దివాకర్, బి.లత, నీలం సురేంద్ర, కొడిదల ఫక్రుద్దీన్, సిండే శోభాబాయి, షేక్ ఫాతీమాబీలను నియమించారు. అదే విధంగా అలంఖాన్‌పల్లె సింగిల్ విండో అధ్యక్షుడు, కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, కడప వ్యవసాయ శాఖ ఏడీఏ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కూడా సభ్యులుగా నియమిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

19 నెలల తరువాత..

2024 సాధారణ ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి రాగానే వైసీపీ పాలనలోని కడప మార్కెట్ యార్డు పాలకమండలి రద్దయిపోయింది. దీంతో ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను కడప మార్కెట్ యార్డుకు పర్సనల్ ఇన్‌చార్జ్(పీఏసీ)గా నియమించింది. ఈ నేపథ్యంలో దాదాపు 19 నెలల తరువాత కడప మార్కెట్ యార్డుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటుచేసింది.

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు

కడప కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేలో భాగంగా కుష్ఠు వ్యాధి గ్రస్థులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్యశాఖాధికారులను ఆదేశించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి 30 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించే కార్యక్రమం చేపట్టనున్నారు. దీనిపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చన్నారు. దీనికి అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా చికిత్స చేస్తారన్నారు.

ప్రొద్దుటూరులో అక్రమాలపై చర్యలు

- ముగ్గురు కమిషనర్లతో పాటు 40 మందిపై చర్యలకు ఆదేశాలు
- జీవో విడుదల చేసిన ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ

ప్రొద్దుటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై మున్సిపల్ ఆర్డీ నేతృత్వంలోని విచారణ కమిటీ నివేదిక ఆధారంగా ముగ్గురు మున్సిపల్ కమిషనర్లతో పాటు 40మంది అధికారులు, సిబ్బందిపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరి సురేశ్ కుమార్ గురువారం ఆదేశాలు జారీచేశారు. 2019 నుంచి 2024 వరకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో చేపట్టిన రూ.70 కోట్ల అభివృద్ధి పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ అధికారులు టెండర్లు చేపట్టడం, పనుల్లో నాణ్యత లేకున్నా బిల్లులు చేసుకోవడంపై చర్యలు తీసుకున్నారు. అలాగే బిల్డింగ్ అప్రూవల్స్, మార్టిగేజ్ విధానం, సెట్‌బ్యాక్ వయలేషన్, ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన అక్రమకట్టడాలు, యూసేజ్ వయలేషన్, రోడ్డు విస్తీర్ణం ప్రకారం సెట్‌బ్యాక్ లేకపోవడం తదితర అక్రమాలపై ఈ చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు ఓచర్స్ ఫైల్స్ కూడా విచారణ బృందానికి అప్పగించకపోవడంపై కూడా చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుతో..

2019 నుంచి 2024 వరకు వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గత ఏడాది జూలై 8న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విన్నవించారు. ఆ మేరకు సీఎంవో నుంచి విచారణ బృందాలను వేసి చర్యలు తీసుకోమని ఆదేశించారు. గత ఏడాది నవంబరులో ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాలు అనేక దఫాలుగా విచారణ చేపట్టారు. దాదాపు 1100 ఫైల్స్‌కు సంబంధించి రూ.100 కోట్ల పనులపై విచారణ చేశారు. అలాగే వైసీపీ హయాంలో పట్టణంలో నిర్మాణమైన అక్రమ కట్టడాలపై కూడా విచారణ బృందం నివేదికలను ప్రభుత్వానికి అందజేసింది. మళ్లీ ఈ నివేదికలపై క్షేత్రస్థాయిలో రెండు బృందాలతో విచారించి చివరికి 43 మందిపై చర్యలకు శ్రీకారం చుట్టింది.

చార్జస్ ఫ్రేమ్ అయిన వారు..

కమిషనర్లు పత్తిపాటి వెంకట రమణయ్య, ఎన్.రాధ, పి.చంద్ర మౌళీశ్వర రెడ్డి, ఈఈలు ఎం.సాయిక్రిష్ణ, కేశవరెడ్డి, దౌలా, ఏఈలు ఉమామహేశ్వరి, బ్యూలా, జివిల్ నిరంజన్ రెడ్డి, అబిద్ హుస్సేన్, దస్తగిరి రెడ్డిలపై చర్యలు తీసుకోనున్నారు. అలాగే డీఈలు వెంకటరమణ, దస్తగిరి, కె.ప్రభాకర్ దాస్, ఎం.రాజేశ్, వి.మునిరత్నం (ఏసీపీ టౌన్‌ప్లానింగ్), సుబ్రహ్మణ్యం(జూనియర్ అకౌంటెంట్), జి.ప్రవీణ్‌కుమార్ (సీనియర్ అకౌంటెంట్), నందం భాస్కర్ (సీనియర్ అసి స్టెంట్), ఎన్వీ రమణయ్య (సీనియర్ అసిస్టెంట్), మేకల రమేశ్ (జూనియర్ అసిస్టెంట్), పి.ఇందిర (టీపీఎస్), శిరీష (టీపీఎస్)తో పాటు పలువురు వార్డు ప్లానింగ్ సెక్రటరీలపై చర్యలు తీసుకోనున్నారు.

విద్యుదుత్పత్తి కేంద్రమా.. బందెలదొడ్డా?



ఆర్టీపీపీ పరిపాలనా భవనం వద్దకు వచ్చిన గేదెల గుంపు

ఎర్రగుంట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే అదో పెద్ద విద్యుదుత్పాక కేంద్రం. చుట్టూ ఎత్తైన ప్రహరీ. కాపలాగా వందలాది మంది ఎస్పీఎఫ్ సిబ్బంది. కానీ గేదెలు మాత్రం చీఫ్ ఇంజినీర్ పరిపాలనా భవనం వద్దకు వస్తున్నాయి. ఇటీవల గేదెల గుంపు ఆర్టీపీపీ నడిబొడ్డున ఉన్న చీఫ్ ఇంజినీర్ పరిపాలనా భవనం వద్దకు వచ్చింది. ఫైర్‌స్టేషన్, ప్రధాన గేటు పక్కనుంచే ఈ గేదెలు వచ్చినట్లు కొందరు పేర్కొంటున్నారు. ఉద్యోగులంతా విస్తుపోయి చూశారు. పరిపాలనా భవనం పక్కనే గ్రిడ్‌కు అనుసంధానం చేసే భారీ సబ్‌స్టేషన్ ఉంది. పరిపాలనా భవనానికి ఆనుకునే పెద్దపెద్ద ట్రాన్స్‌ఫార్మర్స్ కూడా ఉన్నాయి. వాటిలోకి గేదెలు వెళితే పెద్ద ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికి, అన్ని గేట్లలో భద్రతా సిబ్బంది కాపలా ఉన్నప్పటికి గేదెలు ఎలా వస్తున్నాయన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. గేదెలనే అరికట్టలేని వారు గుట్టుచప్పుడు కాకుండా ఆర్టీపీపీ ప్లాంటు నుంచి తరలిపోతున్న స్టీల్ ఇతర వస్తువులను ఏం అరికట్టగలని గుసగుసలాడుతున్నారు. కాగా.. ఆర్టీపీపీలోని సీఈ భవనం దగ్గరకు గేదెలు రావడంపై చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీఎఫ్ ఆర్ఐ రమేశ్ తెలిపారు. కాలనీలోని రెండు చోట్ల నుంచి వచ్చి ఉండవచ్చునని, వెంటనే ఆ దారులు మూసేయాలని సివిల్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.

త్వరలో ఆధునాతన విమానయాన సేవలు

కడప కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు త్వరలో ఆధునాతన విమానయాన సర్వీసులు చేరువ కానున్నాయని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీతో పాటు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్, కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సుజిత్‌కుమార్ పోదారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు విస్తరణకు 75 ఎకరాల భూ సేకరణ, నైట్ ల్యాండింగ్ కోసం సదుపాయాలు, న్యూ టెర్మినల్ బిల్డింగ్ ప్రజలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రజల అవసరాలు ఎప్పటికప్పుడు గుర్తించేలా విమానాశ్రయంలో ఒక ప్యాసింజర్ సలహా బాక్సు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎయిర్‌పోర్టు ప్రధాన ద్వారం నుంచి టెర్మినల్ భవనం వరకు ప్రయాణికులను చేర్చేందుకు ఎంపీ నిధుల ద్వారా ఆరుసీట్ల బ్యాటరీ కారు ఏర్పాటు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌కు అదనంగా ఇండిగో సర్వీసును ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కూడా కోరుతున్నామన్నారు. అనతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం భారతీయ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయికి దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవన శైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందిస్తోందన్నారు. విమానాశ్రయం పరిసరాల్లో పచ్చదనం పరిశుభ్రత ఆహ్లాదకరంగా ఉండేలా కేఎంసీ, పంచాయతీరాజ్‌శాఖలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు పరిధిలో అన్ని రకాల భద్రతా చర్యలతో పాటు, ఎయిర్ పోర్టు ఎదురుగా నేషనల్ హైవే మీద వాహనాల వేగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డీజీఎంలు రాజేశ్వర్, తిరుమల మురగన్, ఆపరేషన్ ఇన్‌చార్జి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి.. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

రూ.30 లక్షల ప్రమాద బీమా

● చెక్కును అందజేసిన ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి



చెక్కును అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ ఆగస్టు 18న ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు బి.ఈశ్వర్ నాయక్ కుటుంబానికి రూ.30 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అందించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో చెక్కు రూపంలో హోంగార్డు సతీమణి బి.లక్ష్మి భాయికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హోంగార్డు కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు, కౌంటర్ హెడ్ ప్రదీప్, మదనపల్లి బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్ రవూఫ్, గర్నమెంట్ ఆర్ఎం రాజేశ్, శాలరీ అకౌంట్ మేనేజర్ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ గ్రామాలు అభివృద్ధి సాధించాలి



ఐపీఎస్ తరుణ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, అన్నిశాఖల అధికారులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లోని గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధి సాధించాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి తరుణ్‌యాదవ్, ఐఎఫ్ఎస్ హర్షవర్ధన్ తెలిపారు. మూడు రోజులుగా మండలంలోని బి.యర్రగుడి, కోనంపేట, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించి ప్రజల జీవన విధానం, జీవనోపాధి కల్పన గ్రామాల అభివృద్ధి, పంచాయతీల విధి విధానాలు, భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలపై మూడు రోజులపాటు ప్రజలతో చర్చించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఎంపీడీవో రెడ్డెయ్య, అధికారులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో చాలా గ్రామాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు ఇలాంటి గ్రామాలపై దృష్టి సారించాలని కోరారు. సన్మానం అందుకున్న వారిలో ఐఆర్ఎస్‌లు తన్మెజాహన్, సౌరభ్‌కుమార్, ఐఆర్ఎస్‌డీ వినీత్‌జాదవ్, ఐఆర్ఎంఎస్ ఆనంద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, ఈవోపీఆర్డీ ఉషారాణి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ఒక వాహనం స్వాధీనం, ఇద్దరు పరార్



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు, ఇన్నోవాతో ఫారెస్ట్ అధికారులు

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్ వైసీ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సానిపాయి రేంజ్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గురువారం వీరబల్లి మండలం తాటిగుంటపల్లి దగ్గర నిఘా ఏర్పాటు చేసిన అటవీ శాఖ సిబ్బందికి ఒక వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా, అది ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో వారు ఆ వాహనాన్ని వెంబడించి సుండుపల్లె మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లె దగ్గర అడ్డుకోగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 626 కేజీల 20 ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి వాటి విలువ రూ.10 లక్షలుగా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. వాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడంతో పాటు, పారిపోయిన వారికోసం గాలిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రజిని, ఎఫ్‌బీవో లీల, శ్రీహరి, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

● బేస్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లలో స్థానం



బాలికలతో ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బేస్‌బాల్ జిల్లా జట్టులో నాగచైతన్య అండర్-17 విభాగంలో సంధ్య, హ్యాండ్‌బాల్ అండర్-14లో ఆసీఫా, చందుప్రియ, దీపిక ప్రధాన జట్టుకు ఎంపిక కాగా స్టాండ్‌బైగా జైబా, అండర్-17 జట్టుకు అహనా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షకీరాబేగం, ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి శుక్రవారం తెలిపారు. బేస్‌బాల్ అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 26 నుంచి నంద్యాలలో, అండర్-14 బేస్ బాల్‌పోటీలు 29 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరులో, అండర్-14 హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు కలికిరిలో జరుగుతాయని ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు.

స్టేట్ లెవెల్ క్రికెట్ పోటీలకు ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన మండల ప్రభుత్వ ఉపాధ్యాయులు

గాలివీడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ టోర్న మెంట్‌లో భాగంగా ఈ నెల 11 నుంచి 13వ తేది వరకు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో క్రికెట్ విభాగంలో గాలి వీడు ఉపాధ్యాయులు ప్రతిభ చూపారు. మండల ఎస్టీయూ సభ్యులు దేరంగుల రామేశ్వర్, మడితం రమణయ్య, పి.సురేశ్‌కుమార్ ఎంపికైనట్లు ఎంఈవోలు పి.నాగరాజు, వి.శ్రీనివాసులు తెలిపారు. వీరు ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న స్టేట్ లెవెల్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఎంఈవోలు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహంపై బ్లూ కలర్ ప్యాంటు, గోధుమ రంగు గళ్ల షర్టు ఉంది. రైల్వేకోడూరు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్యమే మృతికి కారణమై ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇతర వివరాలు తెలియరాలేదని పోలీసులు వివరించారు.



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

ప్రారంభించి... మోకాలొడ్డి

● అర్ధాంతరంగా ఆగిన రహదారి పనులు

● ఐదేళ్లుగా పూర్తికాని పనులు

● నిత్యం ప్రమాదాల్లో పోతున్న ప్రాణాలు

● కూటమి పాలనలోనూ పడని ముందడుగు



ప్రమాదకరంగా కూలేందుకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జి

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-సుండుపల్లె ప్రధాన రహదారి పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. రహదారుల అభివృద్ధికి గత ప్రభుత్వం మోకాలడ్డుతూ వచ్చింది. అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి అరకొరగా నిధులిచ్చి చేతులు దులుపుకొంది. రూ.కోట్ల విలువైన పనులను నిలిపేయడంతో రహదారులపై వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఆటోలు, బస్సులు, కార్లు, లారీలు, టిప్పర్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల వలన పదుల సంఖ్యలో ప్రాణాలు పోగా, అనేక మంది క్షతగాత్రులై అవస్థలు పడుతున్నారు. పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేయడం వలన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. కారులో, బస్సుల్లో వెళ్లాలన్నా, రావాలన్నా గుంతలతో హైరానా తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు ముందడుగు పడలేదు. కూటమి నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రయాణికులు పలుమార్లు జిల్లా అధికారులకు, రవాణా శాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.



ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణం

సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి

\- రామాశ్రీనివాస్, జనసేన నాయకుడు



సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి రహదారి దుస్థితి, ఝరికోన కాలువల విషయం తీసుకెళ్లాను. అంతేగాకుండా రహదారి, భవనాల శాఖ మంత్రి, జిల్లా సర్వోన్నత అధికారికి పలుమార్లు వినతిపత్రం అందజేశాను. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని చెబుతున్నారు.

గతంలో అటవీ అనుమతుల సాకు

వైసీపీ పాలనలో డబుల్ రోడ్డు పనులను ప్రారం భించారు. అయితే సకాలంలో నిధులు కాంట్రా క్టర్లకు అందించకపోవడం వలన పనుల్లో జాప్యం జరిగింది. పైగా రాయచోటి నుంచి సుండుపల్లెకు వచ్చే మార్గమధ్యంలో అటవీ ప్రాంతం ఉండడం వలన అటవీశాఖ అనుమతుల పేరిట దాదాపు ఏడాదికి పైగా ప్రజలను మభ్యపెట్టారు. అయినా గత ప్రభుత్వంలో అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రధానంగా సుండుపల్లె, రాచంవాండ్లపల్లె విద్యుత్ ఉపకేంద్రం నుంచి అనుంపల్లి అటవీ ప్రాంతంలో రహదారి ఇరువైపులా మట్టి కోతతో ప్రధాన రహదారి నుంచి ఎదురుగా వాహనం వచ్చే సమయంలో పక్కకు దిగి ఎక్కాలంటే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సుండుపల్లె-దిగువ గుల్లావాండ్లపల్లె నుంచి సుండుపల్లె విద్యుత్ ఉపకేంద్రం వరకు కూడా సిమెంటు రహదారి పనులు జరగాల్సి ఉంది.

ఐదేళ్లుగా సాగుతున్న పనులు

రాయచోటి-సుండుపల్లె మార్గంలో 20 కి.మీ. మేర రహదారిని విస్తరించేందుకు ఎన్‌డీబీ కింద రూ.61.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రాయచోటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి శిబ్యాల, అనుంపల్లి మధ్య రహదారిని మొదలు పెట్టి వదిలేశారు. ఈ మార్గంలోని శిబ్యాల వంకపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు పక్కనే నూతన వంతెన నిర్మాణానికి కడ్డీలు అమర్చి స్లాబ్ వేయకపోవడంతో అవి తుప్పు పట్టాయి. రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా, కేవీపల్లి, చీనేపల్లి, పీలేరు, రాజంపేటలకు బస్సులు వెళుతున్నాయి. అతుకుల రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రాయచోటి- రాజంపేట రహదారిని 16 కి.మీ. మేర విస్తరించాల్సి ఉండగా పనులు ఉన్నఫళంగా నిలిపేశారు.



అటవీప్రాంతంలో ప్రమాదాలకు నిలయమైన తారు రోడ్డు

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి

\- విశ్వనాథరెడ్డి, రాయచోటి లీగల్ సర్వీస్ కమిటీ మాజీ సభ్యుడు



రాయచోటి- సుండుపల్లె రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా సంవత్సరాల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు సరికాదు. అదే సమయంలో ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు నిధులు కేటాయించాలి.

విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

● జిల్లా ఉప విద్యాశాఖ అధికారి డాక్టర్ నాగయ్య



వికలత్వ నిర్ధారణ శిబిరానికి హాజరైన వారు

రాయచోటిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని డిప్యూటీ డీఈవో డాక్టర్ ఎల్.నాగయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయచోటి నియోజకవర్గంలోని పాఠశాలల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల కోసం సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్దన్ ఆధ్వర్యంలో వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో కంటే నేడు ప్రభుత్వం రవాణా, ఎస్కార్ట్, స్టైపండు, ఇంటి వద్ద విద్యకు రెట్టింపు అలవెన్స్‌లు ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లలు పాఠశాలలకు వెళ్లే విధంగా తల్లిదండ్రులు చూడాలని కోరారు. నిర్ధారణ పరీక్షలకు హాజరైన విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ స్కూటర్, ట్రైసైకిల్, వీల్ చైర్స్, రోలేటర్స్ చంక కర్రలు, వినికిడి యంత్రాలను నెలరోజుల్లోగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ వెంకట్రామయ్య, జీసీడీవో సుమతి, ఏఎస్‌వో అసదుల్లా, ఎంఈవోలు ఆంజనేయనాయుడు, జయచంద్ర, అలీమ్, వైద్యులు శివాసిస్, శివప్రకాశ్, ఆడియాలజిస్ట్ మమత, సమ్మిళిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు

● హాజరు కానున్న 13 జిల్లాల క్రీడాకారులు



మైదానంలో బేస్‌బాల్‌ను ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులు

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ హైస్కూలు మైదానంలో శనివారం నుంచి సోమవారం వరకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 అధ్యక్షుడు టీఎస్‌వీ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోధర శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు అనువుగా మైదానం తయారు చేశామని తెలిపారు. ఈ పోటీల్లోనే ప్రతిభ కల్గిన క్రీడాకారులను ఎంపిక చేసి జనవరిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్లను పంపిస్తామని తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు చెందిన క్రీడాకారులు వచ్చి ఉన్నారని తెలిపారు.

లింగ వివక్షపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న లింగ వివక్షకు వ్యతిరేకంగా జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వర రావు అన్నారు. పీలేరు సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన జెండర్ కమిటీల ఏర్పాటు, లింగ వివక్షపై పోరాటంపై నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీఎంలు, సీసీలకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ అమ్మ కడుపులో నుంచి మరణించే వరకు సమాజంలో మహిళలు అనేక విధాలుగా వివక్షకు గురవుతున్నారన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున ఈ సమస్యను రూపుమాపడానికి క్షేత్రస్థాయిలో చర్చలు, సమావేశాలు, శిక్షణ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. లింగ వివక్షపై పోరాడేందుకు గ్రూపు, గ్రామ, మండల స్థాయిల్లో ఒక సోషియల్ యాక్షన్ టీంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ టీంల ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ దృష్టికి వచ్చే వివక్ష ఉదంతాలను ఆ కమిటీ ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే జిల్లాలో రాయచోటి, పీలేరు, మదనపల్లెల్లో మూడు జెండర్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సెర్ప్ రూపొందించిన కరపత్రాలను ఏపీఎంలు, సీసీలకు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం ధర్మరాజు, రిసోర్స్ పర్సన్ కిజర్ హయాత్ ఖాన్, ఏసీ జవహర్, ఏపీఎంలు అనూరాధ, నర్సోత్తమ రెడ్డి, దేవసేన, పురుషోత్తం రెడ్డి, రజనీ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సక్రమ జీవనశైలితోనే మధుమేహం నియంత్రణ

● జిల్లా అదనపు వైద్యాధికారి రాధిక

రాయచోటిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సరైన జీవనశైలిని అనుసరించడం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాధిక, పారా మెడికల్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల పరిరక్షణ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో 165 దేశాల్లో ప్రజలు ఈ వ్యాధికి గురయ్యారన్నారు. మధుమేహం దీర్ఘకాలిక వ్యాధి అని, అశ్రద్ధ చేస్తే గుండెపై ప్రభావం, కంటి చూపు మందగించడం, శరీరంపై గాయాలు మానకపోవడం, నరాల బలహీనత, పక్షవాతం లాంటివి సంభవిస్తాయన్నారు. ఒకసారి మధుమేహం బారిన పడితే దానిని నిర్మూలించడం సాధ్యం కాదన్నారు. తీవ్రమైన అలసట ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని, సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డెమో దేవశిరోమణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు



వీరభద్రాలయంలో లక్ష గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు, పూజలు చేస్తున్న మహిళా భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కార్తీకమాస శుక్రవారం సందర్భంగా భద్రకాళీ అమ్మవారు లక్ష గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు రాహుకాల పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అన్నదానం చేశారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్య స్వామి పాల్గొన్నారు.

త్వరలో డిజిటల్ పేమెంట్స్

● సహకారశాఖకు రిజర్వ్ బ్యాంకు అనుమతి

● టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్



సహకార వారోత్సవాల్లో మాట్లాడుతున్న విద్యాసాగర్

మదనపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా డిజిటల్ పేమెంట్‌కు రంగం సిద్ధం చేశామని టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ అన్నారు. స్థానిక కో-ఆపరేటివ్ పట్టణ బ్యాంకులో శుక్రవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ నెలాఖరులో టౌన్‌బ్యాంకు శత వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సహకార సంస్థల్లో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పారదర్శకత అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా బ్యాంకులో డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఫోన్-పే, గూగుల్ పే, పేటీఎం అమలుకు, మొబైల్ బ్యాంకింగ్ సదుపాయాల కల్పనకు రిజర్వు బ్యాంకు అనుమతి ఇచ్చిందని, నెలాఖరులో ఆ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి రోషన్ జమీర్ మాట్లాడుతూ టౌన్‌బ్యాంకు వందేళ్లు పూర్తి చేసుకోవడం శుభపరి ణామన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ పి.వి.ప్రసాద్, బ్యాంకు ఉపాధ్యక్షుడు ఎస్.భాస్కర్ కుమార్, డైరెక్టర్లు రవీంద్ర నాథ్, రవికాంత్, ముక్తియార్‌ఖాన్, సోమశేఖర్, నాదెళ్ల శివ, ఆకుల కృష్ణమూర్తి, సర్దార్‌ఖాన్, జె.దేవేంద్ర, భాస్కర్, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి



మృతిచెందిన వెంకటసాయి

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ టిల్లర్ కిందపడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన సంబేపల్లె మండలం శెట్టిపల్లి గ్రామం గాండ్లపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గాండ్లపల్లికు చెందిన భారతి భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటోంది.. ఆమె పెద్ద కుమారుడు షణ్ముఖ వెంకటసాయి (12) శుక్రవారం గ్రామానికి సమీపంలోని పొలం వద్దకు వెళ్లి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఎక్కి స్టార్ట్ చేశాడు. దీంతో భయపడి వెనుకకు పడిపోవడంతో మృతి చెందాడు. ఆ బాలుడు అడవికమ్మపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు.

దత్తత.. సామాజిక బాధ్యత

\- స్త్రీశిశు సంక్షేమ సాధికారత అధికారి హైమావతి

రాయచోటి నేతాజీసర్కిల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దత్తత ప్రేమతో కూడిన సామాజిక బాధ్యత అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి హైమావతి తెలిపారు. శుక్రవారం దేవపట్ల బాలయోగి గురుకుల విద్యాలయంలో బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ మాస వారోత్సవాల సందర్భంగా దత్తత తీసుకోవడాన్ని బలోపేతం చేయడం, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు కుటుంబం ఆధారిత సంరక్షణ అందిద్దాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీవో ఉదయశ్రీ, ఎంఈవో శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, గుడ్ నైబర్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, బాలయోగి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ మధుమతి, ఏఎస్ఐ నాగమణి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైమావతి



స్కానింగ్‌లకు ఆంక్షల సంకెళ్లు!



ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఆర్ఐ స్కానింగ్ విభాగం

- అందని ద్రాక్షలా రోగ నిర్ధారణ
- ఆస్పత్రిలో చేరితేనే స్కానింగ్ రాస్తారట
- వెనుతిరుగుతున్న పేద రోగులు
- జిల్లా ఆస్పత్రిలో బోసిపోతున్న సీటీ, ఎంఆర్ఐ విభాగాలు

అక్కడ చికిత్స మాట దేవుడెరుగు. అసలు రోగమేంటో తెలియాలంటే ఆంక్షల తీరం దాటాల్సిందే. కళ్లెదుట ఎంఆర్ఐ, సీటీస్కానింగ్ విభాగాలు కనపడుతున్నా వాటికి నిబంధనల సంకెళ్లు విధించారు. రెండు రోజులపాటు ఆస్పత్రిలో అడ్మిట్ అయితే తప్ప స్కానింగ్ రాయమంటున్నారు వైద్యులు. దీంతో ఏం చేయాలో అర్థం కాక.. ప్రైవేటు డయోగ్నస్టిక్ సెంటర్లలో వేల రూపాయలు చెల్లించలేక జిల్లా ఆస్పత్రికి వచ్చిన నిరుపేదలు వ్యాధి నిర్ధారణ కాకుండానే వెనుతిరిగే పరిస్థితి నెలకొంది.

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సుమారు ఎనిమిది మండలాల పేద, మధ్యతరగతి ప్రజలకు సేవలు అందిస్తోంది. ఇక్కడ ప్రతి రోజు 900 నుంచి 1100 వరకు ఓపీ ఉంటుంది. ఇక్కడికి ప్రొద్దుటూరు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలు అయిన మైదుకూరు, చాపాడు, రాజుపాళెం, దువ్వూరు, కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల, ఆళ్లగడ్డ, చాగలమర్రి ప్రాంతాల నుంచి వైద్యం కోసం రోగులు వస్తుంటారు. జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే మొదలుకొని అన్ని రకాల స్కానింగ్‌లను ఉచితంగా చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లు కొన్నేళ్ల కిందట ఏర్పాటయ్యాయి. ఏ రోజు కూడా సేవలు అందించడంలో ప్రజలకు ఇబ్బంది కలుగలేదు.

జాయింట్ కమిషనర్ ఆదేశాలతో

ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్‌కిశోర్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ప్రజలకు వైద్యం ఎలా అందుతుంది, రోజుకు ఎంత మంది చికిత్స చేయించుకుంటున్నారు. మందుల సరఫరా తదితర వాటిపై ఆయన ఆస్పత్రి అధికారులతో మాట్లాడలేదు. వైద్యులను పిలిపించి సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లను ఇష్టానుసారంగా రాస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ విభాగాల్లో అధిక మొత్తాల్లో స్కానింగ్‌లు రాయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లు రాయొద్దంటూ హుకుం జారీ చేశారు. అప్పటి నుంచి జిల్లా ఆస్పత్రిలో ఆంక్షల పర్వం మొదలైంది.


బోసిపోయిన సీటీస్కానింగ్ విభాగం

ఆస్పత్రిలో చేరితోనే స్కానింగ్

ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లలో సిటీస్కాన్ తీయించుకుంటే మూడు నుంచి రూ.6 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎంఆర్ఐ స్కానింగ్ అయితే రూ.4 వేల నుంచి రూ.14 వేల వరకు రోగులు చెల్లించాల్సి ఉంటుంది. వేలాది రూపాయలు చెల్లించే స్థోమత లేని నిరుపేదలు జిల్లా ఆస్పత్రిని ఆశ్రయిస్తే ఆంక్షలు భయపెడుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు మినహా ఓపీ ప్రాతిపదికపై ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్‌లు వైద్యులు రాయడంలేదు. ఆస్పత్రిలోని ఆర్ఎంవో, సూపరింటెండెంట్‌లకు కూడా ఈ స్కానింగ్‌లు రాసే అధికారం లేదట. ఒకవేళ రాస్తే సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని జంకుతున్నారు. కేవలం ఆయా విభాగాలకు చెందిన సివిల్ సర్జన్లు మాత్రమే ఈ స్కానింగ్‌లను రాస్తున్నారు. దీంతో వ్యాధి నిర్ధారణ కోసం ఆస్పత్రికి పేద ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

బోసిపోయిన రెండు విభాగాలు

ఇది వరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లలో 12 మంది సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించేవారు. దీంతో రోజుకు 45 నుంచి 60 వరకు సీటీ స్కానింగ్‌లు చేసేవారు. ఎంఆర్ఐ స్కానింగ్‌లు నిత్యం పాతికపైనే నడిచేవి. ప్రస్తుతం కొనసాగుతున్న ఆంక్షలు కారణంగా ఎంఆర్ఐ స్కానింగ్ సంఖ్య పది దాటడంలేదు. సిటీస్కానింగ్‌లు సగానికి సగం తగ్గిపోయాయి. వారాంతపు చివరి రోజుల్లో ఈ విభాగాలు దాదాపు నిలిచిపోయి బోసిపోతున్నాయి. దీంతో ఈ తరహా ఆంక్షలు ఒక్క ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఉన్నాయని, రాష్ట్రంలో మరెక్కడా లేవని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉన్నతాధికారులు పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిబంధనలు సులువుతరం చేయాలని కోరుతున్నారు.

నిబంధనలు అమలు చేస్తున్నాం.

జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలు అమలు చేస్తున్నాం. ఆయా విభాగాలకు చెందిన సివిల్ సర్జన్లు రోగిని పరీక్షించి స్కానింగ్ అవసరం అనిపిస్తే.. ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని స్కానింగ్‌కు సిఫార్సు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర కేసుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. రోగులకు ఇబ్బందిగా మారినప్పటికీ నిబంధనలు అమలు చేయక తప్పదు.

-డాక్టర్ సుజాత, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల్లో డీఐజీ తనిఖీలు

మైదుకూరు/ముద్దనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో ఉమ్మడి కడప జిల్లా రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పి.రామలక్ష్మిపట్నాయక్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. రికార్డుల భద్రత, కార్యాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా త్వరగా రిజిస్ట్రేషన్‌లు చేయాలని సూచించారు. అలాగే పాత మున్సిపల్ ఆఫీసులో సబ్ రిజిస్ట్రారు కార్యాలయం కోసం చేపడుతున్న పనులను సబ్‌రిజిస్ట్రారు డీఎం బాషాతో కలిసి పరిశీలించారు. రికార్డుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ఆన్‌లైన్ సమస్యలు తలెత్తకుండా అన్నీ సమకూర్చిన తర్వాత కార్యాలయం మార్చాలని తెలిపారు.


మైదుకూరులో రికార్డులను పరిశీలిస్తున్న డీఐజి రామలక్ష్మి

ముద్దనూరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం రామలక్ష్మి పట్నాయక్ ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో రెవెన్యూ 70శాతం ఆర్థికవృద్ధి ఉందన్నారు. ఇక్కడి ప్రజలు చాలా వరకు ఇతర ప్రాంతాలలో రెవెన్యూ రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నందున ఆర్థికవృద్ధి తగ్గుతోందన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ వెంకటరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మండల పూజ మహోత్సవాలు

- 30న లక్షార్చన, డిసెంబరు 12న గ్రామోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మండల పూజ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఉత్సవాల ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 16 నుంచి డిసెంబరు 26 వరకు మండల పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 4.30 గంటలకు గణపతి హోమం, అభిషేకం, సర్వదర్శనం, రథోత్సవం, నవకలశ స్థాపన, ధర్మశాస్త్ర హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అయ్యప్ప మాలదారులకు భిక్ష, సాయంత్రం 5 గంటలకు మహాపడి పూజ, రథోత్సవం, హరివరహాసనం, రాత్రి 8.30 గంటలకు భిక్ష ఉంటుందని తెలిపారు. ఈనెల 30వ తేదీ లక్షార్చన, మధ్యాహ్నం 40 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం చేస్తామన్నారు. డిసెంబరు 12వ తేదీ స్వామి వారి గ్రామోత్సవం పురవీధుల్లో కన్నుల పండువగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి అయ్యప్పసేవా సంఘం కార్యదర్శి సతీష్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు నాగేంద్రశర్మ, వల్లంకొండు మనోహర్, ఆరవేటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన వికాసానికి వేదికలు గ్రంథాలయాలు


జాతీయ జెండాకు వందనం చేస్తున్న పద్మజ

కడప కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు కేవలం పుస్తకాలను భద్రపరిచే భాండాగారాలు కావని అవి విజ్ఞాన వికాసానికి ప్రధాన వేదికలని జిల్లా సమాచారశాఖ అధికారిని బి.పద్మజ అభివర్ణించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురష్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. తొలుత గ్రంథాలయసంస్థ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. తదుపరి భారత తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పద్మజ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అందు బాటులో వున్నప్పటికీ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే శక్తి ఒక్క పుస్తక పఠనానికి మాత్రమే ఉందన్నారు. సెల్‌ఫోన్లు, టీవీల్లో ఎన్నో రకాల వైవిధ్యభరితమైన సమాచారం అందుబాటులోకి వస్తున్నా గ్రంథాలయాలు, పుస్తక పఠనం ద్వారా లభించే విజ్ఞానం ఎన్నటికీ మరచిపోలేనిదన్నారు. ప్రతి విద్యార్థి విధిగా కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడపాలని సూచించారు. మాతృభాష తెలుగును ప్రేమించాలని పిల్లలకు ఉద్బోధించారు. మాతృభాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలు సులభంగా అర్థమౌతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పవన్‌కుమార్, ఎంఈఓ రఫీఖ్ అహ్మద్, గ్రంథాలయ అధికారులు రాజకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

పులివెందుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురానికి చెందిన గోర్ల వంశీకృష్ణ యాదవ్ (30) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... శుక్రవారం రాత్రి 8గంటల ప్రాంతంలో వంశీకృష్ణయాదవ్ గొర్రెల వద్ద మొబైల్‌ఫోన్ చూస్తూ కూర్చొని ఉన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు వెనుకవైపు నుంచి వచ్చి కత్తితో దాడి చేశారు. తలపై బలమైన కత్తివేటు పడడంతో వంశీకృష్ణ గట్టిగా కేకలు వేస్తూ అక్కడే పడిపోయాడు. చుట్టుపక్కల బంధువులు హుటాహుటిన పులివెందుల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారులు?

కడప క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో గంజాయి విక్రయిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కడపకు చెందిన కొంత మంది యువత ఇతర జిల్లాల నుంచి గంజాయి తెచ్చుకుని వాటిని ప్యాకెట్లుగా మార్చి ఇతరులకు ఎక్కువ రేటుకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. కడప రిమ్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి దాదాపు 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. నేడో రేపో వారిని అరెస్టు చూపించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

యువతి అదృశ్యం



మైలవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడియం గ్రామంలో కె.మౌనిక (16) అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్యాంసుందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం మూలపల్లికి చెందిన మౌనిక అనే యువతి దొడియం గ్రామంలో పిన్నమ్మ ఉండడంతో వారి ఇంటికి వచ్చి ఇక్కడే ఉండేది. ఈ క్రమంలో బయటికి వెళ్లి వస్తానని చెప్పి రాకపోవడంతో మౌనిక పిన్ని రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లాస్థాయి హాకీ ఎంపికలకు అనూహ్యస్పందన


ఎంపికైన బాలురు, బాలికలు

కడప స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిమ్స్ సమీప వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లాస్థాయి హాకీ బాల, బాలికలు ఎంపికలకు అనూహ్యస్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి ఔత్సాహిక బాల, బాలికలు దాదాపు 80 మంది హాజరయ్యారు. స్పోర్ట్స్ స్కూల్ హాకీ కోచ్‌లు అనిల్, ఖాదర్‌బాష ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. పర్యవేక్షకులుగా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ పీడీ మురళీకృష్ణారెడ్డి, రామనపల్లి జెడ్‌పీహెచ్‌ఎస్ పీడీ పోలంకి గణేష్ బాబు హాజరయ్యారు. హాజరైన బాల, బాలికలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఇందులో బాలికల విభాగంలో టి.కావ్య, డి.హన్సిక, సి.బాస్మిన్, పి.హర్షిత, సి.శరణ్య, బి.మహాలక్ష్మి, పి.సునయన, ఎం.నాగనందిని, పి.గంగాకావ్య, ఎస్.ప్రశాంతి, ఎం.అమృతాదేవి, వి.మనీషా, కె.స్నేహిత, ఎస్.హరిత, బి.రాణి, పి.ప్రణతి, వై.సంజన, బి.అమృతతో పాటు స్టాండ్‌బైగా ఎల్.లక్ష్మి, కె.హరిప్రియ, ఏ.ప్రణవి, టి. శివజ్యోతి ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో సి.శరణ్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ అమర్‌నాథ్, డి.సుశాంత్, కె.గీతేశ్వర్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.ఇస్మాయిల్, వెంకటలిఖిత్, జె.అభినవ్, ఎ.మనోజ్‌కుమార్, ఎస్.వెంకటజగత్, ఎస్.ఇర్ఫాన్‌బాష, ఎ.రాజు, ఎంవీ విష్ణువర్ధన్, వి.సాయిమోహన్, జి.అనూప్‌కుమార్, జె.మహేష్‌బాబు, ఎ.రిషిత్‌వర్మ, జి.మంజునాథ్‌తో పాటు స్టాండ్‌బైగా ఎస్.సోహైల్, ఎ.చరణ్, ఓ.హరిప్రసాద్ ఎంపికైన వారిలో ఉన్నారు.

పరిశోధనల్లో జాతీయ సంస్థలతో పోటీపడాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ స్కాలర్లు పరిశోధనల్లో కేంద్ర విద్యా సంస్థలతో పోటీపడాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో పరిశోధక విద్యార్థుల కోసం రెండు రోజుల రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి స్కాలర్ నాణ్యమైన పరిశోధనలు చేసి పరిశోధనపత్రాలను రూపొందించాలన్నారు. వాటిని ప్రతిష్టాత్మక జర్నల్స్ అని స్కోపస్, స్ప్రింగర్స్, ఎమరాల్డ్‌లో ప్రచురితం చేయించుకోవాలన్నారు. ఇతర విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల పరస్పర సహకారంతో జాతీయ అంతర్జాతీయ సెమినార్లలో భాగస్వామ్యం వహించాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాస్‌కుమార్ రీసెర్చ్ డిజైన్ గురించి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటటీ ప్రొఫెసర్ ఐరాల లోకనాథన్‌రెడ్డి రీసెర్చ్ ఇన్స్ట్రుమెంట్స్‌పై అవగాహన కల్పించారు. వైవీయు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య చంద్ర ఓబులరెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించారు. ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, పీఎం ఉష సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ అధ్యాపకులు, స్కాలర్లు పాల్గొన్నారు.

సాంకేతికతతో వేగవంతమైన నిర్ణయాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను ఉపయోగించి వ్యాపార రంగంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవచ్చని హైదరాబాద్ సెట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ వి.శ్రీనివాసకుమార్ అన్నారు. శుక్రవారం వైవీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖలో బిజినెస్ అనలిటిక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిగ్ డేటా, డేటా మైనింగ్, రిపోర్టు, పబ్లిషింగ్ వంటి విషయాలపై విశ్లేషించారు. కస్టమర్లను అర్థం చేసుకోవడం, వ్యాపార నివేదికలను రూపొందించడం గురించి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంబీఏ శాఖాధిపతి డాక్టర్ పి.సరితసమన్వయం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల భవిష్యత్తుకు ప్రమాదకరంగా సీపీఎస్

కలసపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారిన టెట్, సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఉపాధ్యాయులందరు తప్పనిసరిగా టెట్ పాస్ కావాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూడడం తగదన్నారు. ప్రభుత్వాలు స్పందించి విద్యాహక్కు చట్టంలో సవరణలు చేసి 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అలాగే ఉపాధ్యాయ కుటుంబాలను రోడ్డుపాలు చేసే సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఏఐఎఫ్ఈటీఓ అనుబంధ సంఘాలతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాలు చేపడతామన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న ఎస్టీయూ నేత రమణారెడ్డి

డ్రాగా ముగిసిన అండర్-14 బాలుర క్రికెట్ మ్యాచ్‌లు


మణిదీప్ (చిత్తూరు), చరణ్‌తేజ (కర్నూలు)

కడప స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 బాలుర మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేవోఆర్ఎం క్రికెట్ స్టేడియంలో కడప-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.2 ఓవర్లలో 289 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 11 పరుగులే చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండోరోజు శుక్రవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి మొత్తం 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 347 పరుగులు చేసింది. ఇందులో మణిదీప్ 127, రక్షణ సాయి 92 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలువడంతో భారీ స్కోర్ సాధించింది. దీంతో చిత్తూరు జట్టు 58 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యతతో 3 పాయింట్లు సాధించింది. కడప జట్టుకు 1 పాయింట్ లభించింది.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 70.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 351 పరుగుల స్కోర్ వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం కర్నూలు జట్టు మొదటి రోజు 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. శుక్రవారం తిరిగి బ్యాటింగ్‌కు చేపట్టి 84.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 239 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో చరణ్‌తేజ 108, రిషి 71 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించగా, నెల్లూరు జట్టుకు 3, కర్నూలు జట్టుకు 1 పాయింట్ దక్కింది.

ఘనంగా బాలల దినోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో సాయిబాబాపాఠశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప అక్కాయపల్లె సాయిబాబా విద్యాసంస్థలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ ఎం.వీ.రామచంద్రారెడ్డి పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాది రాళ్లవంటి వారిని చెప్పారు. కార్పొరేటర్ ఎంవీ శ్రీదేవి మాట్లాడుతూ పిల్లలు వినయం, విధేయతతో ఎదగాలని సూచించారు. వైస్ చైర్మన్ ఎంవీ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా విద్య అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గురుకుల విద్యాపీఠంలో...



మాట్లాడుతున్న విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప ఎన్జీఓ కాలనీ గురుకుల విద్యాపీఠ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో పిల్లలు అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈఓ ఏఎల్ వివేకానంద, డైరెక్టర్ డి.పల్లవి, ఏడీఆర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.



చైతన్య హైస్కూల్లో వివిధ వేషధారణల చిన్నారులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ఉపాధ్యాయులు

వేంపల్లె..: వేంపల్లెలోని చైతన్య హైస్కూల్లో చిల్డ్రన్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషంలో చిన్నారులు అలరించారు. చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఉషాకిరణ్ హైస్కూల్లో : వేంపల్లె ఉషాకిరణ్ హైస్కూల్లో కరస్పాండెంట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.



వివిధ వేషధారణల చిన్నారులతో ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి

నాగార్జున హైస్కూల్‌లో ...

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున హైస్కూల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శివ తులశమ్మ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలను అలరించాయి.



ప్రసంగిస్తున్న హెచ్ఎం సి.కృష్ణారెడ్డి

వైవీయూలో భవన నిర్మాణాలకు భూమి పూజ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో వెయిటింగ్ హాల్ నిర్మాణాలకు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు విశ్వవిద్యాలయానికి వచ్చిన సమయంలో వారు ఉండడానికి అన్ని వసతులతో కూడిన వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం ఉష, కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్, వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైవీయూ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, వైవీయూ ఇంజనీర్ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ పి. సరిత, వార్డన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని డిగ్రీ కళాశాల సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ ఉన్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

మహిళల ద్వారానే మార్పు సాధ్యం

సీకేదిన్నె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళల ద్వారానే మార్పు సాధ్యమని జడ్పీసీఈవో ఓబుళమ్మ తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో శుక్రవారం ఐసీడీఎస్ ద్వారా మహిళలకు పరిశుభ్రతపై, బేటీ బచావో, బేటీ పఢావో, బాల్య వివాహాల నివారణపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని, అది ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. తడి, పొడిచెత్తను వేరు చేసి దానిని ఎరువుగా మలచి ఆదాయాన్ని కూడా పొందవచ్చన్నారు. దీని ద్వారా ఆదాయంతోపాటు కాలుష్యం తగ్గి పచ్చదనం-పరిశుభ్రత పెరుగుతుందన్నారు. మహిళలు తలుచుకుంటే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీసీఈవో ఓబుళమ్మ

ఈ సందర్భంగా స్థానిక వైద్యులు రాఘవేంద్ర, కవిత, ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. చైల్డ్‌హెల్ప్‌లైన్, వనిత హెల్ప్‌లైన్, పోలీసు హెల్ప్‌లైన్, ఉచిత న్యాయసేవా, తదితర అంశాలపై మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో శాంతమ్మ, ఎంపీడీవో కుళాయిబాబు, ఐసీడీఎస్ సిబ్బంది సునీత, పద్మిని, ప్రసన్న, సూపర్‌వైజర్లు శ్రీదేవి, లక్ష్మీదేవి, ట్రైనర్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

- కడప సర్కిల్ ఎస్ఈ ఎస్.రమణ

పెండ్లిమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఏపీఎస్పీడీసీఎల్ కడప సర్కిల్ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు.గంగనపల్లె గ్రామసచివాలయంలో శుక్రవారం ఎస్ఈ ప్రజలతో సమావేశం అయ్యారు. గ్రామస్థులు తమ సమస్యలను తెలిపారు. విద్యుత్‌సంస్థ ప్రజలకు అందించే సేవలపై క్షేత్రస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల విశ్వాసాన్ని బలపరుస్తామని ఎస్ఈ తెలిపారు.ఈ సమావేశంలో ఈఈ హరిసేవ్యానాయక్,ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.



స్టార్టప్ హబ్ నిర్మాణ పనుల పరిశీలన

కడప కలెక్టరేట్,నవంబరు 14 ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల సమీపంలో నిర్మాణంలో ఉన్న పీ-4 స్టార్టప్ కడ ప హబ్ సెంటర్ నిర్మాణ పనులను శుక్రవారం రాత్రి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. సంబంధిత హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజరత్నం, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: జిల్లాను వ్యర్థరహిత జిల్లాగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ లోని బోర్డుమీటింగ్ హాలులో గ్రీన్ లీఫ్ రేటింగ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో కమిటీ మెంబర్లు, టూరిజం అధికారి సురేష్‌కుమార్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్‌ల అనుమతులకు సిఫార్సు: జిల్లాలో నిర్వహణలో ఉన్న 6 చిల్డ్రన్స్‌హోమ్స్‌కు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ సిఫార్సు చేయడం జరిగిందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జువైనల్ జస్టిస్ యాక్టు ప్రకారం నిర్వహించే జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ల లైసెన్సింగ్‌కు జిల్లా స్థాయి ప్రతిపాదన కమిటీ సమావేశం జరిగింది.కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వంట సామగ్రి పరిశీలన: జిల్లాలో 720 అంగన్వాడీ కేంద్రాలకు సాక్ష్యం అంగన్వాడీ పథకం ద్వారా అందివ్వాల్సిన వంట సామగ్రి,నిర్వహణకు అవసరమైన అన్ని రకాల వస్తువుల నాణ్యతలను శుక్రవారం రాత్రి కలెక్టర్ ఛాంబరు వద్దకు ఐసీడీఎస్ అధికారులు పరిశీలనార్థం అంగన్వాడీ వంట సామాగ్రిని తీసుకు రావడం జరిగింది. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి,జేసి అదితి సింగ్‌లు వాటి నాణ్యతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి రమాదేవి, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకాళమ్మగూడూరులో రైతులతో సమావేశం

పులివెందుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలంలోని అంకాళమ్మగూడూరు హార్టికల్చర్ అసిస్టెంట్ డబ్బుతో పరారైన విషయంపై రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ఒక ప్రకటనలో తెలిపారు. డబ్బుతో పరారైన విషయం తెలియగానే సంబంధిత అధికారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించామన్నారు. శనివారం సాయంత్రం 4గంటలకు అంకాళమ్మగూడూరు సచివాలయం ప్రాంగణంలో ఆర్డీఓ, వ్యవసాయాధికారులతో చర్చించనున్నామన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

కడప క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఎల్లవేళాల అందుబాటులో ఉంటామని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తామని సీఐ చిన్న పెద్దయ్య అన్నారు. కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సీఐగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1998 బ్యాచ్‌కు చెందిన ఈయన కడప జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. 2011లో సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం తిరుపతి శ్రీ సిటీకి సీసీఎస్ సీఐగా పనిచేస్తూ కడప వన్‌టౌన్‌కు బదిలీపై వచ్చారు.



చిన్న పెద్దయ్య

టెట్ నుంచి మినహాయించేందుకు కృషిచేయండి

పులివెందుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్ట సవరణ ద్వారా ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించేందుకు కృషిచేయాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పులివెందులలోని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఇంటి వద్ద ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

17న పింఛనర్ల నిరసన

పులివెందుల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పింఛనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17వ తేదీన తలపెట్టిన నిరసనను జయప్రదంచేయాలని ఏపీ పింఛనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక గఫూర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

రైతుల శ్రేయస్సు కోసం పూర్తి సహకారం

చెన్నూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సహకార సంఘం ద్వారా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని సింగిల్‌విండో అధ్యక్షుడు ముండ్ల శ్రీనివాసులరెడ్డి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవ సందర్భంగా చెన్నూరు సొసైటీలో ఆ శాఖ అధ్యక్షుడు మాట్లాడుతూ రైతులకు తమ సొసైటీ ద్వారా చిన్నసన్నకారు రుణాలు అందిస్తామని ఆయన తెలిపారు. త్వరలో రైతులకు సొసైటీ ద్వారా ఎరువులు కూడా అందించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, అటవీశాఖ రాష్ట్ర మాజీ డైరెక్టరు రామనశ్రీలక్ష్మి, సీఈవో గంగిరెడ్డి, రైతు నాయకులు అల్లాడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పవన్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదు'

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్ రెడ్డికి లేదని కడప అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్ వైసీపీ నేతల ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలానే కడపవైసీపీ నాయకుడు అంజాద్‌బాషపై కూడా తీవ్రంగా స్పందించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీరాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకర శ్రీనివాస్

ఓటరు సమగ్ర సవరణపై అవగాహన సదస్సు

పులివెందుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటర్ల సమగ్ర సవరణపై స్థానిక మున్సిపల్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రఎన్నికల సంఘం అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. 2026లో చేపట్టే సమగ్ర సవరణ ప్రక్రియపై ఎలక్షన్ కమిషన్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడు, పులివెందుల,చక్రాయపేట, వేముల, సింహాద్రిపురం,తొండూరు తహసీల్దార్లు, బూత్ లెవెల్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'బీఎస్ఎన్ఎల్‌కు ప్రజాదరణ'

కడప రూరల్, నవంబర్ 14(ఆంధ్రజోతి) : దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సాంతికపరంగా పురోభివృద్ధి సాధిస్తూ ప్రజాధరణ పొందుతోందని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, లీగల్ అవేర్‌నెస్ ఫర్ ఉమెన్ సంస్థ అధ్యక్షుడు పి. ప్రమోద్‌కుమార్, బీఎస్ఎన్ఎల్ ఇంజనీర్ సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డుల ఉచిత పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, బీఎస్ఎన్ఎల్ ఇంజనీర్లు ఎస్. మైనుద్దీన్ బాష, కె. మహేష్, అస్లాం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

పెండ్లిమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు.వెల్లటూరు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవస్థానం సన్నిధిలో నూతనంగా నిర్మించిన దుకాణాల సముదాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదన్నారు. దేవదాయశాఖ ఏసీ మల్లికార్జున ప్రసాద్,ఈఓలు మారుతీప్రసాద్, సురేష్‌రెడ్డి,టీడీపీ నాయకులు నాగమల్లారెడ్డి,కర్నాటి చంద్ర,కంభన్న గారిశివారెడ్డి, నాగభూషణం,సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి హిందూ కార్తీక వనభోజనానికి

హిందువులు తరలిరండి

చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద సరస్వతిస్వామి

కడప కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆఖరి కార్తీక ఆదివారం సందర్భంగా ఈనెల 16వ తేదీన కడప-రాజంపేట రోడ్డులో ఉన్న శ్రీ లలితా పంచాయతన దేవాలయం (చిన్మయ మిషన్)లో సనాతన హిందూ ధర్మాన్ని అనుసరిస్తున్న అన్ని కులాల వారికి హిందూ కార్తీక వనభోజన కమిటీ సారథ్యంలో సామూహిక హిందూ కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద సరస్వతీస్వామి పేర్కొన్నారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక శ్రీ లలితా పంచాయతన దేవాలయంలో పలు హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ లలితా పంచాయతన దేవాలయంలో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శ్రీ కంఠేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, తదుపరి గోమాత పూజ, అనంతరం 8-30 నుంచి 10-30 వరకు శివపార్వతుల కల్యాణోత్సవం జరుగనుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12-30 నుంచి 3-30 వరకు హిందూ కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ప్రతి హిందువూ హాజరై సనాతన సంస్కృతిని పరిరక్షించాలని కోరారు. సమావేశంలో వారణాసి శ్రీధర్‌శర్మ, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, విజయానందరెడ్డి, లెక్కల కొండారెడ్డి, పిచ్చిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి



గంగమ్మ దేవస్థానం నూతన పాలక మండలితో పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు భక్తులకు మెరుగైన సేవలు అందించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె గంగమ్మ దేవస్థానం చైర్మన్, ధర్మకర్తలి మండలి సభ్యులుగా శుక్రవారం సోమల మాధవరెడ్డి చైర్మన్‌గా, సభ్యులుగా గుర్రాల రామకృష్ణ, గుజ్జల మహేశ్వరి, కొడతల ఈశ్వరమ్మ, హసనాపురం సరస్వతి, బుక్కే కాంతమ్మ, చెన్నంశెట్టి శ్రీనివాసులు, కమ్ము సుబ్బరాయుడు, పాలగిరి చంద్రాయుడు, పాణ్యం సుబ్రమణ్యం, డి.గంగయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుత్తా నరసింహారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టక్కోలి క్రిష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, శంకర్‌రెడ్డి, జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, ఈవో కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

హరిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

పెండ్లిమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హరిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని డీపీఆర్‌సీ ట్రైనింగ్ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.ఎంపీడీఓ సభాభవనంలో రెండోరోజు శుక్రవారం సర్పంచులు,కార్యదర్శులకు ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ రామసుబ్బారెడ్డి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.

డయాబెటిస్‌పై అవగాహన అవసరం



డయాబెటిస్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో శుక్రవారం వరల్డ్ డయాబెటిస్‌డే సందర్భంగా జన విజ్ఞాన వేదిక, సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్, ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం సంయుక్తంగా డయాబెటిస్‌పై పోస్టర్ ప్రదర్శన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి విచ్చేసిన డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ డయాబెటిస్ పై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, గౌరవాధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ,ఆర్ట్స్ కళాశాల ఉపన్యాసకులైన సావిత్ర , డాక్టర్ పి.రవి, శివరాం, నరసింహారెడ్డి, వెంకటరామరాజు, జగదీష్, శంకర్, బాలస్వామి, విజయ్, నాగసుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డి,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిహార్‌లో ఎన్డీఏ విజయంపై సంబరాలు

పులివెందుల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):బిహార్‌లో మరోమారు డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడిందంటూ పులివెందులలో బీజేపీనాయకులు సంబరాలు చేశారు. శుక్రవారం బిహార్ రాష్ట్రఎన్నికల ఫలితాలలో ఎన్డీయూ కూటమి విజయం సాధించడంతో స్థానిక పూలంగళ్ల సర్కిల్‌లో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డిమాట్లాడుతూ బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనపట్ల బీహార్ ప్రజలు మరోసారి విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎన్.విజయలక్ష్మి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎన్.లక్ష్మమయ్య, పులివెందుల మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ వాజ్‌పేయినాయుడు, భానుప్రకాష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: బిహార్‌లో ఎన్డీఏ విజయం అపూర్వమని రాష్ట్రకౌన్సిల్ మెంబరు బాలగురవయ్య తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు.అనంతరం బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి,యువమోర్చ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి,కార్యదర్శిపుల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె..: బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించడం పట్ల వేంపల్లెలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నాలుగురోడ్ల కూడలి, బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు సుష్మ ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్‌లో స్వీట్లుపంచిపెట్టారు. బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పులివెందులలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు,కార్యకర్తలు

బిహార్ ఎన్‌డీఏ దే : రమణారెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో ఎన్‌డీఏ ఘన విజయం సాధించిందని ఆడిటర్ ఎస్.వి. రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.దేశంలో ఎన్‌డీఏ హవా నడుస్తోందన్నారు. ఏ పార్టీ అయితే సీ అనే అక్షరంతో ఉన్నదో ఆ పార్టీ అంతరించిపోవడం ఖాయమన్నారు.

వర్షపు నీళ్లు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు , నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని 1 వవార్డు బొల్లవరంలోకి వర్షపు నీరు ప్రవేశించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలు వస్తే బొల్లవరంలోకి నీరు ప్రవేశించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా పత్రికల్లో కూడా వర్షాలకు బొల్లవరంలో నీటి ప్రవాహం రోడ్లపైకి రావడంపై కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో ఆప్రాంతాన్ని సందర్శించి అక్కడి కాలువను పరిశీలించారు. వర్షం వస్తే ఈ నీటి ప్రవాహం బొల్లవరం ఊరి మీద పడకుండా మడూరు కాలువలోకి డైవర్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి టీడీపీ నేతలు ఈవీ సుధాకర్‌రెడ్డి బద్వేలు శ్రీనివాసులరెడ్డి, కుతుబుద్దీన్‌లు ఉన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- గుంతలను పూడ్చాలంటున్న ప్రజలు



రాజువారిపేట గ్రామం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

చాపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల వద్ద రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో పలు దఫాలుగా భారీ వర్షాలు కురిసాయి. కురిసిన వర్షాలకు రోడ్లు మెత్తబడిపోయి ఎక్కడపడితే అక్కడ గుంతలు పడుతున్నాయి. ఇదిలా ఉండగా చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లె నుంచి ద్వారకానగరం వరకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేను బెంగుళూరు నుంచి విజయవాడకు వెళ్లేందుకు హైవేను నిర్మిస్తున్నా రు. ఈ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన మట్టి, సుద్దరాళ్లు మైదుకూరు వద్ద ఉన్న కొండ లు, గుట్టల నుంచి ప్రతి రోజు సుమారు 100 టిప్పర్లతో తీసుకొస్తున్నారు. టిప్పర్లు 30 టన్నుల నుంచి 50 టన్నుల వరకు మట్టిని ఓవర్‌లోడుతో తీసుకొస్తున్నాయి. అందువలన వాటితో రోడ్లు బాగా దెబ్బతిని గుంతలు ఏర్పడి చాలా చోట్ల రోడ్డు నెర్రలు చీలింది. కొత్తరాజువారిపేట, రామచంద్రనగర్, నక్కలదిన్నె, అనంతపురం, కుచ్చుపాప, అల్లాడుపల్లె గ్రామాల వద్ద రోడ్లు చాలా దెబ్బతిన్నాయి. రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ తారు రోడ్లును రెండున్నర ఏళ్ల క్రితం నిర్మించారు. పదేళ్లపాటు గట్టిగా ఉండాల్సిన రోడ్లు అప్పుడే దెబ్బతినడంతో ఆ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై వాహనాలు తిరిగేందుకు బరువు 18 టన్నులు మాత్రమే ఉండాలి. టిప్పర్లు 50 టన్నుల బరువుతో తిరుగుతున్నా రోడ్లు, భవనాల శాఖ అధికారులు మౌనంగా ఉండడం . ఇప్పటికైనా సంబందిత అధికారులు తగి న చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గుడిపాడు-గొల్లపల్లెకు మెటల్ రోడ్డు

- తీరిన 20 ఏళ్ల రైతన్నల నిరీక్షణ
- ఎమ్మెల్యే చొరవతో సమస్యకు పరిష్కారం

దువ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుడిపాడు నుంచి గొల్లపల్లె వరకు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న మెటల్ రోడ్డు పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. ఎన్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టి వాటిని 70 శాతం పూర్తి చేశారు. దువ్వూరు మండలంలో గుడిపాడు మీదుగా గొల్లపల్లె వరకు రోడ్డు 2.5 కి.మీ. పొడవునా నిర్మిస్తున్నారు. ఇక్కడ నడక దారి కూడా సరిగాలేని పరిస్థితులు మునుపు ఉండేవి. 20 ఏళ్లుగా రోడ్డు నిర్మించమని రైతులు పలుమార్లు విన్నవించుకోవడం ప్రజాప్రతినిధులు వచ్చి టెంకాయ కొట్టినా పనులు చేపట్టకపోవడం ఇలా రెండు మూడు దఫాలు జరిగింది. ప్రస్తుత ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంతో ఈ దారి ఆరు మీటర్లు వెడల్పుతో రైతుల బండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తిరిగే విధంగా పనులు చేస్తున్నారు. దారి వెంట రెండు కల్వర్టులను నిర్మిస్తుండడంతో దూరం తగ్గుతుంది. 2.5 కి.మీ ప్రయాణ సౌలభ్యంతో పంట ఉత్పత్తులను నేరుగా రైతులు వారికి అనువైన చోటికి చేర్చుకునే అవకాశం ఏర్పడింది.

పొలాలకు పెరుగుతున్న విలువ

ఇక్కడ రెండున్నర కిలోమీటరు పొడవునా దారి ఏర్పడుతుండడంతో పొలాలకు మంచి విలువ వస్తోంది. ఈ ప్రాంతంలోని పొలాలకు తెలుగుగంగ జలాలు ప్రవహిస్తుండడం రైతులకు కలిసి వచ్చే అంశం. దారి వెంబడి గుడిపాడు, గొల్లపల్లె, మనేరాంపల్లె, చల్లబసాయిపల్లె రైతుల పొలాలు ఉన్నాయి. రోడ్డుతో రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి.



గుడిపాడు నుంచి గొల్లపల్లె వరకు నిర్మిస్తున్న మెటల్ రోడ్డు

మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలి



మధుమేహ దినోత్సవం పై ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు , నవంబఋ 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజురోజుకు షుగర్ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారని ఇందుకు సరైన ఆహారం, వ్యాయమం లేకపోవడమేనని వైద్యాధికారి డాక్టర్ భరత్ నారాయణ తెలిపారు. గురువారం స్థానిక శ్రీరాముల పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ మధుమేహ వ్యాధి పై ప్రజల్లో అవగాహనపెంచేందుకు వైద్యాధికారులు సిబ్బంది ర్యాలీ చేపట్టారు. షుగ్ అనేది దీర్ఘకాలికంగా ఉంటుందని షుగర్ వచ్చాక ప్రతి ఒక్కరు మందులు వాడటంతో పాటు ఆహార నియమాలు పాటించి క్రమం తప్పకుండా వ్యాయామం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

పోరుమామిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని నర్సిగపల్లెలో గంపా విష్ణు అనే రైతు పొలంలో గురువారం రాత్రి దుండగులు ట్రాన్స్‌పా ర్మరును చోరీ చేశారు. ఈ ఘటనలో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న ఆయిల్‌ను, రాగిని తీసుకుని బాక్సును పడేసి వెళ్లారని బాధితుడు విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేశాడు.

లేఖారచన పోటీలు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'ధాయిఆఖర్' జాతీయ స్థాయి లేఖ రచన పోటీ 2025-26 కార్యక్రమాన్ని తపాలాశాఖ ప్రారంభించిందని ప్రొద్దుటూరు డివిజన్ సూపరింటెండెంట్ జి.కిరణ్ శుక్రవారం తెలిపారు. పోటీలు డిసెంబరు 8 వరకు ఉంటాయన్నారు. లేఖను హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలో విద్యార్థులు, ప్రజలు అందరు పాల్గొని రాయవచ్చన్నారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు ప్రొద్దుటూరు డివిజన్ 516360 చిరునామాకు డిసెంబరు 8 లోపల లేఖలను పంపాలన్నారు.

ఎన్డీఏ విజయంతో బీజేపీ సంబరాలు

మైదుకూరు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించడం పట్ల మైదుకూరు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక రాయల్ కూడలి వద్ద బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు.

బద్వేలులో: బీహార్‌లో ఎన్‌డీఏ కూటమి 202 స్థానాలు కైవసం చేసుకోవడం పట్ల బీజేపీ నాయకులు నాగులు రోడ్ల కూడలిలో బాణాసంచా పేల్చిస్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి పవన్‌కుమార్, పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య రాయల్, రామసుబ్బారెడ్డి, రామకోటిరాజు, ప్రసాద్ రాయల్ పాల్గొన్నారు.

ప్రతి మండలానికి 50 మినీ గోకులాలు

ముద్దనూరు నవంబరు14(ఆంధ్రజ్యోతి):ప్రతి మండలానికి 50 మినీ గోకులాలు మంజూరు చేసినట్లు పశుసంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎస్‌ఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఏరియా పశువైద్యశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా గొర్రెలు, మేకలకు మినీ గోకులాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గాలికుంటు వ్యాధి టీకాలు వందశాతం పూర్తి చేశామన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్యశాలల సిబ్బంది హాజరును ఫేస్ సెల్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పశువైద్యశాల ఇన్‌చార్జి సహాయసంచాలకుడు వాసాశ్రీనివాస, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

మైలవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పల్లెలో ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్తను బుట్టల్లో వేస్తే పంచాయతీ సిబ్బంది సేకరణ చేపట్టి డంపింగ్‌యార్డులకు తరలించి చెత్తనుండి సంపద సృష్టించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంటలో: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎంపిడీవో వెంకటరమణయ్య తెలిపారు. శుక్రవారం పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామపంచాయతీలు అనే అంశంపై ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు, వీఓఏలకు ఎంపిడీవో కార్యాలయంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి నూర్జహాన్, టీఓటీ భానుప్రశాంత్ పాల్గొన్నారు. పొట్లదుర్తిలో ఎంపీడీవో వెంకటరమణయ్య చెత్త సేకరణ పనులను పరిశీలించారు.

విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని యోగివేమన యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఏజీ దాము పేర్కొన్నారు. ఎస్వీ డిగ్రీ కళాశాల 20వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రాయల్ కౌంటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో శోభారాణి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈవోలు శోభారాణి, సావిత్రమ్మలు పేర్కొన్నారు. శుక్రవారం దేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి బాలల దినోత్సవం పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు 20 సంవత్సరాలు కష్టపడితే ఆ తర్వాత 80 సంవత్సరాలు సంతోషంగా గడుపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గోపీనాథరెడ్డి, జింకా సుబ్రమణ్యం, చాడా మునిశేఖర్‌రెడ్డి, గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ పాల్గొన్నారు. అంతకు ముందు గ్రేడ్-1 గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. అలాగే రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో : మండలంలోని తువ్వపల్లె క్రాస్‌రోడ్డు వద్ద నున్న ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాలా నెహ్రూ జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారికి బహుమతలును అందించారు. కాగా బాలల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని జీవీ సత్రం హైస్కూల్‌లో వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నూరే సుబ్బరాజు, పబ్బతి గోపాల్, డీవీ సురేంద్ర పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పీఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెడ్మాస్టర్ ఝన్సీరాణి, శశికళ పాల్గొన్నారు. జమ్మలమడుగు ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో సైదున్నీషా, గ్రంథాలయ అధికారి బాబ్జి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివశంకర్

చాపాడులో: పటిష్ఠమైన సమాజం కోసం విద్యార్థుల పాత్ర కీలకమైందని మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ అన్నారు. చాపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్నపెద్దయ్య, ఎంఈవో రవిశంకర్, హెడ్మాస్టర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు. రిటైర్డు టీచర్ శ్రీనివాసులు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు బహుమతులుపంపిణీ చేశారు. ప్రభుత్వ గ్రంథాలయంలో లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డి, డీడీవో రవిశంకర్‌రెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్లూరులో : అట్లూరు మండలంలోని కుంభగిరి సచివాలయంలో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో సరస్వతి, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, ఎంఈవో విలియం రాజు, అంగన్వాడీ సూపర్‌వైజరు విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో :బాలల దినోత్సవ వేడుకలు పోరుమామిళ్ల మండలంలో ఘనంగా జరిగాయి. శుక్రవారం సిద్దవరం ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలరు పుల్లయ్య సహకారంతో విద్యార్థులకు ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మైదుకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని రచయిత, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రదాన కార్యదర్శి తోట రామమోహన్ అన్నారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వాహకుడు మనోహర రావు ఆధ్వర్యంలో మైదుకూరు శాఖా గ్రంథాలయంలో రామమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవరచుకోవాలన్నారు. అనంతరం స్కూల్ విద్యార్దులకు మిఠాయిలు పంచారు.

కొండాపురంలో: గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఎంఈవోలు ఓబులేసు, రామయ్యలు తెలిపారు. శుక్రవారం స్థానిక లైబ్రరీలో వారు 58 వ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ నెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయన్నారు. లైబ్రరీయన్ వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార సంఘ వారోత్సవాలు

దువ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని సింగిల్‌విండో సొసైటీలో శుక్రవారం 72వ అంతర్జాతీయ సహకార సంఘ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేశారు. స్థానిక సహకార సంఘం అధ్యక్షుడు పోలు రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులరెడ్డి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: అంతర్జాతీయ సహకార వారోత్సవాలను బ్రహ్మంగారమఠం సోమిరెడ్డిపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో చైర్మన్ వెల్లటూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. సీఈవో రామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు,

కాశినాయనలో: వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బంగారు గురివిరెడ్డి పేర్కొన్నారు. సహకార సంఘం వారోత్సవాలను పురష్కరించుకొని శుక్రవారం నర్సాపురం వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద పాలకమండలి సభ్యులు సిబ్బంది తో కలిసి జెండాను ఎగురవేశారు.ఈసందర్భంగా మాజీ ప్రదాని జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, సహకార సంఘం బోర్డు మెంబర్లు వేణుగోపాల్‌రెడ్డి,క్రిష్ణయ్య టీడీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, దుగ్గిరెడ్డి, రవీంద్రారెడ్డి, రోహిత్‌రెడ్డి,శ్రీనివాసులరెడ్డి, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన టెట్



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఒక గుదిబండగా మారిందని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ నాయకులు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య, రీజినల్ కన్వీనర్ సలీంలు మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులు డీఎస్సీ ద్వారా ఉత్తీర్ణత సాధించి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఇంటర్వ్యూలో పాసై ఉద్యోగంలో చేరారన్నారు. 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను టెట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాగే సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భారంగా మారాయన్నారు. ఉన్నతాధికారులు సబ్జెక్టు నిపుణులతో ప్రశ్నాపత్రాలు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కరీం, సుబ్రమణ్యం, ఓబుళరెడ్డి, జీసీఎం రెడ్డి, కోనేటి శ్రీనివాసులు, రవి, కొండయ్య, రషీద్‌ఖాన్, కొత్తపల్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠాలకు యాజమాన్య హక్కు



గ్రామ సభలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

దువ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠ భూములకు, ఇళ్లకు వారి ఆధీనంలో ఉన్న ఆధారాలు అందజేస్తే యాజమాన్య హక్కు కల్పించవచ్చని జమ్మలమడుగు డీఎల్‌పీవో నూర్జహాన్, డీడీవో రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మనేరాంపల్లె, చల్లబసాయిపల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్‌పీవో, డీడీవోలు మాట్లాడుతూ గ్రామకంఠ భూములకు, ఇళ్లకు యాజమాన్య హక్కు పొందే అంశాలగురించి వివరించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదరు గ్రామ కంఠ భూములు, ఇళ్లకు ఆధారాలు తప్పకుండా ఉండాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణయాదవ్ పాల్గొని ప్రసంగించారు.

రవాణా ఖర్చులు రావంటూ ఉల్లి రోడ్డు పాలు



ముద్దనూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి చిన్నదుద్యాల రైతులు ఉల్లికి కనీస ధర కూడా లేకపోవడంతో కోసిన ఉల్లిని గురువారం రోడ్డు ప్రక్కన పడేశారు. రోడ్డున వెళ్లువారు చూసి ఉల్లి రైతుకు ఎంత నష్టం అంటున్నారు.చిన్నదుద్యాల గ్రామంలో దాదాపు 20 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. దిగుబడి బాగా వచ్చేందుకు ఎంతో ఖర్చు చేశారు. దిగుబడి బాగా వచ్చిందను కుంటే ఎప్పుడు లేని విధంగా ధర తగ్గిపోయిందని ఆవేదన చెందుతున్నారు.కనీసం పెట్టిన పెట్టుబడులైనా వస్తాయని కూలీలతో పంట తీశారు.మార్కెట్‌లో ధర పడిపోవడంతో ట్రాన్స్‌పోర్టు కూడా రైతు మీద పడుతుందని భయంతో రైతులు కోసిన ఉల్లిని పులివెందుల ప్రధాన రహదారిలో రోడ్డు ప్రక్కన పడవేయడంతో చూపరులను తలచివేస్తుంది.ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, రఘురామిరెడ్డి కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి):ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి వైద్యులను కోరారు. శుక్రవారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చిన రోగులందరికి వైద్యం అందించాలని మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాను భూపేశ్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి, మల్లికార్జున, పొన్నతోట శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ : జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రజా సమస్యలపై భూపేశ్‌రెడ్డి గ్రీవెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రీవెన్స్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు.

రజకులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి



జీవో పత్రాలను విద్యుత్‌శాఖ జేఈవోకు అందిస్తున్న దృశ్యం

బద్వేలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రజకులకు చెందిన ల్యాండ్రి షాపులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి సంఘం రాష్ట్ర డైరెక్టర్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలవళి వేణుగోపాల్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విద్యుత్ కార్యాలయంలోని జేఈవోకు రజకసంఘ నాయకులతో కలిసి అందుకు సంబంధించి జీవో పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రజకుల ల్యాండ్రి షాపులకు ఉచిత విద్యుత్ జీవోను ప్రభుత్వం జారీ చేసిందని , ప్రభుత్వం ఇచ్చిన విద్యుత్ రాయితీలను అధికారులు తక్షణం అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రజక వెల్ఫేర్ కమిటీ మాజీ సభ్యుడు గోవిందయ్య పల్లి క్రిష్ణయ్య, టీడీపీ బీసీ నాయకులు పి. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

ఖాజీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూని యర్ సివిల్ జడ్జి ఖాజా మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం మోడల్‌స్కూలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి వ్యాసరచన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజల్లో చైతన్యం వచ్చేలా యువకులు చైతన్యం కావాలన్నారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, లాయర్ జ్వాలా నరసింహ, ప్రిన్సిపల్ విజయనరసింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సానపురెడ్డి నాగ ఓబుళమ్మకు ఘన నివాళులు



సానపురెడ్డి ఓబుళమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

బద్వేలు నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): దివంగత సానపురెడ్డి నాగ ఓబుళమ్మ 3వ వర్ధంతి సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని పెన్షనర్స్ కార్యాలయంలో శుక్రవారం పలువురు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి స్వగ్రామం బోవిళ్ల వారిపల్లె గ్రామంలో పేదలకు ఆమె జ్ఞాపకార్థం చీరలను పంపిణేశారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ వాకలమల్ల రాజగోపాల్‌రెడ్డి, సానపురెడ్డి రామగోపాల్‌రెడ్డి, సానపురెడ్డి రాధాక్రిష్ణారెడ్డి, పెన్షనర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు , కమిటి సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

కాశినాయన నవంబరు14 (ఆంధ్రజ్యోతి) వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగనపల్లెలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో పోటీచేయాలని అందుకు తగట్టుగా మండల కమిటీలు బూత్ ఇంచార్జిలు కృషిచేయాలన్నారు. అనంతరం మండల బీజేపీ అధ్యక్షుడుగా బిజివేముల నారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాద్‌రెడ్డి, శ్రీనివాసులు, బీజేవైఎంనేత విజయ్, పండరి పాల్గొన్నారు.